
## పహిల్వాన్‌షా ఉర్సుకు ఎంతో ప్రాముఖ్యత



**షాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త :** షాబాద్ పహిల్వాన్ షా ఎంతో ప్రాముఖ్యత కలిగిందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని షాబాద్ పహిల్వాన్ షా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....షాబాద్ పహిల్వాన్ షా దర్గా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. షాబాద్ పహిల్వాన్ షా ఎంతో ప్రాముఖ్యత కలిగిందన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముస్లీం సోదరులు తదితరులు ఉన్నారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## బిజెపిలో చేరిన యువకులు



**శామీర్‌పేట, డిసెంబరు 22, ప్రభాతవార్త**
మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సమక్షంలో పలువురు యువకులు బిజెపిలో చేరినట్లు మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ కార్యదర్శి ఎన్.హైమారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎంపి ఈటల రాజేందర్ నివాసంలో తూంకుంట మున్సిపాల్టీకి చెందిన హకీంపేట్, సింగాయిపల్లి గ్రామాలకు చెందిన పలువు రు యువకులు బిజెపిలో చేరారని ఆమె వివరించారు. బిజెపిలో చేరిన వారిలో యువకులు ఎం.అశీష్, ఆకాశ్, మేఘరాజ్, ప్రభంజన్, దీపక్, అక్షయ్, సావన్, విశాల్, రోహిత్, ప్రభాకర్, ప్రణయ్, కళ్యాణ్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, కార్యదర్శి ఎన్.హైమారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రంగంలోకి నకిలీ కమర్షియల్ ట్యాక్స్ అధికారులు!

### వాణిజ్య పన్నుల శాఖ పేరిట అక్రమార్కుల వాహన తనిఖీలు..?
### షాద్‌నగర్‌లో పలు రూట్లలో దూకుడుమీదున్న దొంగ అధికారులు

**షాద్‌నగర్, డిసెంబరు 22 ప్రభాతవార్త :** రోడ్లపై అనుమానం ఉన్న వాహనాలకు చెందిన "వే బిల్లులు" పరిశీలించి అందులోని సరుకును తనిఖీ చేసి విలువను అంచనా వేయడం, ఏ తేడా ఉన్న సరుకు విలువకు రెండింతలు అపరాధ రుసుం విధించడం.. చెల్లించకపోతే సరుకు రవాణా వాహనాన్ని స్వాధీనం చేసుకునే అధికారం కమర్షియల్ టాక్స్ అధికారుల తనిఖీ బృందాలకు ఉంటుంది. ఇదే అదనుగా భావిస్తున్న కొందరు అక్రమార్కులు నకిలీ కమర్షియల్ టాక్స్ అధికారులుగా చలామణీ అవుతూ అందినకాడికి దోచుకెళ్తున్నారంటూ కొందరు బాధితులు వాపోతున్నారు. వస్తువులను కొనుగోలు చేసి సరఫరా చేసే క్రమంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతంలో ఆయా రోడ్లలో నకిలీలు తిష్ట వేసి కమర్షియల్ టాక్స్ అధికారులుగా చలామణీ అవుతున్నట్లు సమాచారం. వాహనాలు పట్టుకొని కాసేపు హడావుడి సృష్టించి వారి వద్ద నుండి ఎంతో కొంత బేరమాడి వాహనాలను వదిలేస్తున్నట్లు సమాచారం. ఇటీవల పరిగి రోడ్డు, ఓల్డ్ హైవే తదితర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు కొందరికి ఎదురయ్యాయని చెబుతున్నారు. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లుగా కొత్త అవతారం ఎత్తుతున్న అక్రమార్కులు వాహనాలను తనిఖీ చేసి వే బిల్లులకు వాహనంలో ఉన్న వస్తువులకు తేడా ఉండడం గమనించి వాటిపై టాక్స్ విధిస్తాం, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామంటూ బెదిరించడంతో బాధితులు ఎంతో కొంత సమర్పిస్తున్నారు. పట్టణ కేంద్రంలోని పరిగి రోడ్డు, ఎలికట్ట, సర్దార్ నగర్, మొగిలిగిద్ద పరిశ్రమలు ఉన్న ప్రాంతాలు, ఇటువైపు నందిగామ, కొత్తూరు, జడ్చర్ల వైపు కొన్ని నకిలీ బృందాలు కమర్షియల్ టాక్స్ అధికారులుగా చలామణీ అవుతూ అందినకాడిచి దోచుకుపోతున్నారు. ఇటీవల షాద్‌నగర్‌కు చెందిన ఓ లారీని కూడా ఒక కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ అంటూ సదరు లారీని పట్టుకున్నాడు. అనవసరంగా రాద్ధాంతం ఎందుకని ఎంతో కొంత ముట్టజెప్పి పంపించారు. ఆ తర్వాత అతడి గురించి ఆరా తీస్తే అతడు నకిలీగా రూఢీ అయ్యింది.

వాణిజ్య పన్నుల శాఖ అధికారుల తనిఖీలు అక్రమార్కులు కొందరికి బంగారు బాతుగుడ్డులా మారాయి. అక్రమాల్ని గుర్తించిన వెంటనే బేరసారాలు ఆడడం, అందినకాడిని వసూళు చేసుకొని వదిలేస్తున్నారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చాక రాష్ట్రాల సరిహద్దుల్లో తనిఖీల కేంద్రాలను పూర్తిగా ఎత్తివేశారు. తద్వారా సరుకులు రవాణా చేసే వాహనాలు గంటల పాటు తనిఖీల కోసం ఆగే అవసరం కూడా లేకపోగా వ్యాపార సంస్థల్లో సోదాలకు అడ్డుకట్ట పడింది. కొందరు వ్యాపారులు అక్రమాలకు పాల్పడడంతో వాటిని నిలువరించేందుకు జీఎస్టీ కౌన్సిల్ 2018 నవంబర్‌లో వే బిల్లు విధాన్ని అమల్లోకి తెచ్చింది. 50 వేలు మించి విలువైన ఏ సరుకుకైనా రవాణా చేయాలంటే వే బిల్లు తప్పనిసరి చేసిన సర్కార్ ఒకే బిల్లుపై ఎక్కువసార్లు రవాణా చేసి అక్రమాలకు పాల్పడకుండా చర్యలు చేపట్టింది. వేబిల్లు తీసుకునే సమయంలోనే దూరాన్ని బట్టి అందులోనే సమయాన్ని నిర్దేశిస్తారు. వాహనం వెళ్లాల్సిన సమయాన్ని మించి సరైన కారణంగా లేకుండా సరుకు రవాణా కాకుంటే అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చి అపరాధ రుసుం విధిస్తుంటారు.

ప్రతి డివిజన్‌కు 2 ప్రత్యేక బృం దాలు, రాష్ట్ర సరిహద్దు జిల్లాలు, ఎక్కువ రవాణా వాహ నాలు, గోదాములు ఉన్న డివిజన్ల పరిధిలో 4 నుండి 8 బృందాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధానంగా ఐరన్ స్క్రాప్, రెడీమెడ్ దుస్తులు, చక్కెర, ఎలక్ట్రానిక్ వస్తు వులు, కంప్యూటర్ ర్యామ్‌లు, మెడిసిన్ తదితర వాటికి వే బిల్లులు లేకుండానే రవాణా అవుతున్నట్లు సమాచా రం. తనిఖీలు ముమ్మరంగా చేస్తే అక్రమార్కులకు అడ్డు కట్ట వేయొచ్చని భావించిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఇలాంటి నకిలీలపైనా దృష్టి సారించాలి.



స్వర్గీయ మాజీ మంత్రి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పిస్తున్న అధికారులు

## బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి

### కలెక్టర్‌లో వర్ధంతి వేడుకలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** స్వర్గీయ కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయ సమావేశం హాలులో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, సాంఘీక సంక్షేమ అధికారి మల్లేశం, డివై.ఎస్.ఓ హనుమంతు రావు తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. స్వర్గీయ వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శుక్రవర్ధన్ రెడ్డి, హాస్టల్ వార్డె న్లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమూర్తి మృతిపట్ల ప్రగాఢ సంతాపం

**శామీర్‌పేట, డిసెంబరు 22,ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లా సిపిఐ నాయకులు రొయ్యల కృష్ణమూర్తి (55) అకాల మరణం పట్ల మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై నగరంలోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఉన్న కృష్ణమూర్తి (55) శనివారం రాత్రి మృతిచెందినట్లు ఆయన వివరించారు. సిపిఐ పార్టీ కోసం, బిసిల హక్కుల సాధన కోసం పనిచేసి అందరిలో గుర్తింపును పొందారని ఆయన మృతి సిపిఐ పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలియజేసి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుబూతిని డిజి సాయిలుగౌడ్ తెలియజేశారు. ఆయనతో పాటు పలువురు సిపిఐ నాయకులు ఆయన కృష్ణమూర్తి మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# జిల్లాలో ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**ప్రజాపాలనలో వచ్చిన ధరఖాస్తులు 1,43,267**
**ఈ నెల 31వ తేదీ వరకు సర్వే పూర్తికి చర్యలు**
**గ్రామాల్లో, మున్సిపల్ వార్డులో జోరుగా సర్వే**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 22, ప్రభాతవార్త**
జిల్లా వ్యాప్తంగ ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో గతంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజలు 1,43,267మంది ధరఖాస్తులు చేసుకున్నారు. గత పది రోజుల నుంచి గ్రామాల్లో, మున్సిపల్ వార్డుల్లోనూ ఇందిరమ్మ ఇండ్ల ధరఖాస్తుల విచారణ లబ్దిదారులను గుర్తించటానికి సంబంధిత అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 15మండలాల పరిధిలో ఉన్న గ్రామాలలో, మున్సిపాల్టీల పరిధిలో 31,597ధరఖాస్తులను సర్వే చేయటానికి సంబంధిత అధికారులకు ఇప్పటి వరకు కేటాయించారు. మొబైల్ యాప్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల ధరఖాస్తులను ఇంటింటా పర్యటించి గ్రామాల్లో గ్రామపంచాయతీల కార్యదర్శిలు, సిబ్బంది, మున్సిపాల్టీల్లోని వార్డులో వార్డు సంబంధిత అధికారులు ఆ ధరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా పరిశీలించి ధరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ఇందిరమ్మ ఇండ్ల ధరఖాస్తుల లబ్దిదారుల గుర్తింపునకు సర్వే పూర్తి కానున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఆర్అండ్‌బి, హౌజింగ్ సంబంధిత అధికారులు ఇందిరమ్మ ఇండ్ల ధరఖాస్తుల సర్వేకు కార్యచరణ సిద్ధం చేసి ధరఖాస్తుల పరిశీలన పూర్తి చేస్తున్నారు. ధరఖాస్తుదారుల పూర్తి డేటాను ఇండ్ల పరిస్థితిని, ఖాళీ స్థలంను, వారి స్థితిగతులను పరిశీలించి మొబైల్ యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే రోజు వారీగ సర్వే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగ ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ నెల 19న, 20న మొత్తం బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 1,853ధరఖాస్తులు, దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో 1,447, దుండిగల్ మున్సిపల్‌లో 1,602, ఘట్‌కేసర్ మండలంలో 2,130, ఘట్‌కేసర్ మున్సిపల్‌లో 1,466, గుండ్లపోచంపల్లి మున్సిపల్‌లో 1,343, జవహర్‌నగర్ మున్సిపల్‌లో 1,606, కీసర మండలంలో 1,390, కొంపల్లి మున్సిపల్‌లో 1,243, మేడ్చల్ మండలంలో 3,080, మేడ్చల్ మున్సిపల్‌లో 1,533, మూడుచింతలపల్లి మండలంలో 2,123, నాగారం మున్సిపల్‌లో 2,176, నిజాంపేట్ మున్సిపల్‌లో 1,555, ఫీర్జాదిగూడ మున్సిపల్‌లో 2,355, పోచారం మున్సిపల్‌లో 1,611, శామీర్‌పేట మండలంలో 1602, తూంకుంట మున్సిపల్‌లో 1,482 ధరఖాస్తులు సర్వేకు కేటాయించినట్లు, రోజు వారీగ ధరఖాస్తులను వారికి సర్వేకు కేటాయిచి సర్వే చేయిస్తున్నారు. గ్రామాలలో, మున్సిపల్ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ఉండటంతో ధరఖాస్తుల పరిశీలన, లబ్దిదారుల గుర్తింపునకు సర్వే కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు చెప్పవచ్చు.



తుర్కపల్లిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్న దృశ్యం

# ఉద్దెమర్రి శ్రీవిష్ణు,శివాలయాలకు రూ.50 లక్షల నిధులు

### మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి

**శామీర్‌పేట, డిసెంబరు 22, ప్రభాతవార్త**
ఉద్దెమర్రిలో పూర్వం భక్త రాందాసు హయాంలో అక్కన్న,మాదన్నలు నిర్మించిన శ్రీవిష్ణు,శివాలయం (శ్రీవేంకటేశ్వరస్వామి,శివుని ఆలయాలు)లో పలు అభివృద్ధి పనుల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం 50లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు, ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధిక నిధులు మంజూరు చేయటం చారిత్రాత్మకమని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ తెలిపారు. ఈ ఆలయ చైర్మన్, కమిటీ సభ్యుల, గ్రామ నాయకుల వినతి మేరకు ఆలయ అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకుని నిధులను మంజూరు చేయించిన మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు వారు ప్రత్యేకంగ దన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిధుల మంజూరు చేసినందుకు వారు దన్యవాదాలు తెలియజేశారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిలో శ్రీవిష్ణు,శివాలయం వద్ద మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, ఆలయ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరి, కమిటీ సభ్యులు బూడిద రవీందర్‌గౌడ్,సామల రాజిరెడ్డి, మాజీ సర్పంచులు దోసకాయల వెంకటేశ, పట్ట బాలనర్సింహ్మా, పార్టీ నాయకులు నేమూరి విష్ణుగౌడ్, తునికి వెంకటేశలు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఉద్దెమర్రి శ్రీవిష్ణు,శివాలయంలో నూతన గాలిగోపురం, పుష్కరఘాట్, నిరాలి మండపాల నిర్మాణాల కోసం 50లక్షల రూపాయలు మంజూరు చేయటం చారిత్రాత్మకమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల మంజూరు కోసం సహకరించిన పార్టీ ఇన్‌చార్జి, టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ఎస్.హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌కు, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్‌లకు కూడ వారు ప్రత్యేకంగ దన్యవాదాలు తెలియజేశారు. ఉద్దెమర్రిలో శ్రీవిష్ణు,శివాలయం పురాతన కట్టడాలతో ఉండి దాతల చేయూతతో కొంత అభివృద్ధి చేసుకుంటున్నప్పటికీ, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయటానికి నూతన గాలిగోపురం, పుష్కర ఘాట్, మండపాల నూతన నిర్మాణాలు చేపట్టటానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. పూర్వం నిర్మించిన శ్రీవిష్ణు,శివాలయం వాగుపక్కన ఉండి మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయం ఉండటం, మరింత అభివృద్ధి జరిగి భక్తులకు సౌకర్యాలు కల్పించటానికి ప్రభుత్వం కృషి చేయటానికి నిధులు మంజూరు ఇవ్వటం ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పార్టీ నాయకులు పెద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్ల ప్రభాకర్‌రెడ్డి, బొద్దుల వెంకటగిరి ప్రసాద్, గోపిరెడ్డి, శ్రీధర్‌చారి, పి.వెంకట్‌రెడ్డి, ఎం.సత్యనారాయణ, శేఖర్, సుధాకర్, ఆలయ పూజారి తిగుళ్ల వెంకటేశ్వరశర్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నర్సింలుయాదవ్, పాల్గొన్న ఆలయ చైర్మన్ ఆడెపు ఉమామహేశ్వరి, సభ్యులు

# ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అసెంబ్లీ స్పీకర్

**వికారాబాద్, డిసెంబర్ 22, ప్రభాతవార్త:** అసెంబ్లీ స్పీకర్ కుటుంబ సభ్యులైన గడ్డం ఎల్లయ్య, ఎల్లమ్మ అనసూయ, క్రిష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్(గ్యాక్) ఆద్వర్యంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గిరిగేట్‌పల్లిలో స్థానిక నాయకులు ఉచిత వైద్య శిభిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. స్పీకర్ వైద్యులచే కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, మా కుటుంబ సభ్యుల పేరుపై ఏర్పాటు చేసిన గ్యాక్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్యాక్ అంటే జర్మనీ భాషలో ఆపదలో ఆదుకోవడం అని అర్థం వస్తుందని అన్నారు. కరోనా తరువాత ప్రజలలో వ్యాధుల తీవ్రత పెరిగిందని, ఆధునిక కాలంలో ప్రజల అలవాట్లు మారిపోయాయని అన్నారు. పోగ త్రాగడం, ఆల్కహాల్ సేవించడం, ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగంతో పెరిగి వత్తిడి పెరిగి అనారోగ్యాల భారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎంత పని వత్తిడిలో ఉన్నా ఆరోగ్యం కోసం ప్రతి రోజు ఉదయం 3 గంటలు కేటాయిస్తా ని, వ్యాయామం, యోగా వంటివి తప్పకుం డా చేస్తానని తెలిపారు. అందరు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి ఆహారం తీసుకోవడంతో పాటుగా ప్రతినిత్యం వ్యాయామం, యోగా వంటివి చేయాలని సూచించారు. మనస్సును ఎల్లప్పుడు ప్రశాంతంగా ఉంచుకోవాలని, అప్పుడే మన శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, ఎన్ని ఆస్తులు ఉన్నా ఆరోగ్యంగా లేకపోతే ఆనందంగా ఉండలేమని అన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం గ్యాక్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలను అందించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తా ని స్పష్టం చేశారు. వైద్య శిభిరంలో వైద్య సేవలు అందించిన వైద్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఎన్.కిషన్‌నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్. రాంచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, రెడ్యానాయక్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## రాజ్యాంగంతో అందరికి సమాన హక్కులు

**ఘట్‌కేసర్, డిసెంబర్ 22, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ పీఠికలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై అంబేద్కర్ వివరించారని తెలంగాణ విజిలెన్స్ క్రైమ్, సెంట్రల్ యాంటీ కరప్షన్ ఫౌండేషన్ డైరెక్టర్ బాషగళ్ల విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 193వ వారం నిత్యపూల మాళ కార్యక్రమం నిర్వహించారు. పీబీఐ మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం.అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయ్‌కుమార్‌గౌడ్ విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళ వేసి నివాళులు అర్పించి బాబాసాహెబ్ సేవలను కొనియాడారు. అందరికి సమాన విద్య, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ హక్కులు అందించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు అంబేద్కర్ ఎంతగానో కృషి చేశాడని, రాజ్యాంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, సబండ వర్గాల కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లు, హక్కులను తీసుకువచ్చారని కొనియాడారు. ఈసందర్భంగా అందరూ రాజ్యాంగపీఠికపై ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, రాష్ట్ర వడ్డెర యువత సంఘం అధ్యక్షులు దేరంగుల బాల్‌రాజ్, అంబేద్కర్ సంఘం ప్రధానకార్యద్శి ఇరిటం శ్రీనివాస్, నాయకులు నారాయణ, నర్సింగ్‌రావు, రాజేశ్‌కుమార్, సత్యం, గంగారాం, అంజయ్య, వెంకటేశ్వరరావు, కృష్ణంరాజు, విష్ణు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న విజయ్‌కుమార్‌గౌడ్, అరుణ్‌కుమార్

# సందిగ్ధంలో పంచాయతీ ఎన్నికలు

### రాజకీయ నాయకుల అనుమానాలు

**యాచారం డిసెంబర్ 22 ప్రభాతవార్త**
పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం అధికారులు అన్ని ఏర్పాట్లు చేసిన ఎన్నికల నిర్వహిస్తారో లేదో అని సందేహంలో రాజకీయ నాయకులు సందిగ్ధంలో ఉన్నారు. వార్డుల వారిగా ఓటర్ లిస్ట్ జాబితా సవరణ జరిగే రెండు నెలలు అవుతుంది. పోలింగ్ కేంద్రాలు సవరణ తుది జాభితా సిద్ధం చేశారు. పోలీస్ శాఖ కూడా పోలింగ్ కేంద్రాలకు రూట్ మ్యాప్ తయారు చేశారు. సర్వం సిద్ధం ఉన్న ప్రభుత్వంలో చర్చ జరగడం లేదు జనవరిలో జరుగుతాయ లేదా అనే అనిషితి నెలకొంది. 2018 చట్టం మార్పు చేర్పులపై ఎన్నో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీ గణన రిజర్వేషన్ల మార్పు పై సందిగ్ధంలో ఉన్న ప్రభుత్వం రాజకీయ నాయకులు ఎటు తేల్చుకోలేకపోతున్నారని విశ్లేషకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2018 చట్టం జీవో మారుస్తూ అమలు చేయాల్సి ఉంది ఇప్పటికే జరగకపోవడంపై సందేహాలు వినిపిస్తున్నాయి. బీసీ గణన చేసిన బీసీల సంఖ్య పెరిగిన ఓసీలకు భారీ నష్టం జరగబోతుంది దాంతో 24 గ్రామపంచాయతీలకు ఆరు గ్రామపంచాయతీలో ఉన్న రిజర్వేషన్లు అవి కాస్త మూడుకు మారే అవకాశం ఉంది. వీటన్నింటి దృష్టిలో ఉంచుకొని బీసీ గణన తూతుమంత్రగానే చేసి రిజర్వేషన్ల మార్పు జరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు లేక గ్రామపంచాయతీలకు సంవత్సరకాలం గడుస్తున్న పాలన గాడి తప్పిందని జనవరిలో జరగకుంటే కాలయాపన అవుతుందని ప్రజాప్రయోజనాల దుష్ట తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని పలువురు భావిస్తున్నారు. జనవరి ఫిబ్రవరి మార్చ్ అంటూ కాలయాపన చేస్తే మాత్రం మే వరకు తప్పదని ఫిబ్రవరి మార్చ్ లో స్కూళ్లకు కాలేజీలకు విద్యాసంస్థలకు పరీక్షలు ఉండడం వలన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించడం ఇబ్బంది అవుతుందన్న కోణంలో మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల జరిగితే జనవరి లేదా మే నెలలో ఉంటాయని మరికొందరు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని ప్రత్యేక అధికారుల పాలనలో అభివృద్ధి జరగక కుంటుపడుతుందని సర్పంచుల ఎంపీటీసీల తక్షణమే ఎన్నికలు జరగాలని ప్రజలు కోరుతున్నారు.




గ్రామపంచాయతీ కార్యాలయం

# ప్రజావ్యతిరేక విధానాలపై ఎంపి ఈటల ఆగ్రహం

**ఘట్‌కేసర్, డిసెంబర్ 22, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పోరాటాలకు తప్పకుండా స్పందన ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్ నివాసానికి ఆదివారం వెళ్లిన ఆయన ఈటలను శాలువాతో సనా ్మనించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుకున్నదే తడవుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ తెచ్చిన హైడ్రా, లగచర్లలో బలవంతపు భూసేకరణలపై మొదటగా దిక్కార స్వరాన్ని వినిపించిన ఎంపీ ఈటల పోరాట ఫలితంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునందని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు వెనుకడుగు వేయకుండా సూటిగా సర్కారు ప్రశ్నించి ప్రజల అభీష్టానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేసేలా ఎంపీ కృషి చేస్తున్నారని పేర్కొంటూ సన్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు గొంగళ్ల బాలేశ్, బసవ రాజుగౌడ్, బిజెవైఎం నాయకులు ఉన్నారు.





# పుస్తకాల పండుగకు పోటెత్తిన పఠన ప్రియులు

**ముషీరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 37వ హైదరాబాద్ బుక్‌ఫేర్‌కు పుస్తక ప్రియులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావటంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, పుస్తకాభిమానులు వేలాది మంది మధ్యాహ్నం 12 గంటల నుండే బుక్‌ఫేర్ వద్ద బారులు తీరారు. కిక్కిరిసిన సందర్శకులతో ఎన్టీఆర్ స్టేడియం లో ఒక పండుగ వాతావరణం నెలకొంది. నాలుగురోజుల నుండి కొనసాగుతున్న బుక్‌ఫేర్‌కు రోజూ 30, 40 వేల మంది వస్తూ ఉండగా ఆదివారం ఒక్కరోజే దాదాపు 80 వేల మంది సందర్శించారని నిర్వాహకులు తెలిపారు.

**అలరించిన బాలోత్సవ కార్యక్రమాలు...**

బుక్‌ఫేర్‌లోని బోయి విజయభారతి వేదికపై మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 5 వరకు చిన్నారులను ప్రోత్సహిస్తూ బాలోత్సవ కార్యక్ర మాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సిరిఆర్ట్ స్వామి నిర్వహణలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. అదేవిధంగా అనిల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాలల బృంద నృత్యాలు ఆహుతులను అలరించాయి. అనంతరం డాక్టర్ సి.ఏ.ప్రసాద్ నిర్వహణలో షిరోస్ ప్రముఖ మహిళలు ప్రదర్శన అందరినీ ఆలోచింప చేసింది. ఈ సందర్భంగా బాలోత్సవ కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతిగా పుస్తకాలను, సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో చొక్కాపు వెంకట రమణ, భూపతి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



**పుస్తకావిష్కరణలు...**

ఆదివారం బుక్‌ఫేర్‌లోని తోపుదు బండి సాదిక్ అలీ వేదికపై బొడుసు పుస్తకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. డాక్టర్ వెల్దండి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణసభకు ప్రముఖ కథకులు, విమర్శకులు కే.ఆనందాచారి ముఖ్యఅతిథిగా హాజరవగా, ప్రముఖ కథకులు డాక్టర్ కాలువ మల్లయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదే విధంగా బోయి విజయభారతి వేదికపై నన్ను ప్రభావితం చేసిన పుస్తకం పేరుతో జి.లక్ష్మి నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి అశ్వనికుమార్, పోయెట్, ట్రాన్స్‌లేటర్ ఆరతి హెచ్.ఎన్ పాల్గొన్నారు. ఇదే క్రమంలో తోపుదు బండి సాదిక్ అలీ వేదికపై వరుసగా మూడు పుస్తకాల ఆవిష్కరణలు జరిగాయి. అంబేద్కరిజం అంటే ఏంటి? తిరుపతి బాలాజీ బౌద్ధ క్షేత్రమే, డాక్టర్ అంబేద్కర్ కణగారిన కులాల భవిష్యత్తు పుస్తకాలను సమాంతర వరుణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం కాలోజీ కళాక్షేత్రంలో ప్రొఫెసర్ కంచె ఐలయ్య ద సూద్ర రెబెలియన్ పుస్తకావిష్కరణ సభ జరిగింది.

# సేవామూర్తులను గౌరవించుకోవాలి : రమణాచారి

**నాంపల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త :** సమాజ సేవ దైవకార్యంతో సమానమని, సమాజంలో వివిధ విభాగాల్లో తమవంతు బాధ్యతగా అశేష సేవలందిస్తున్న సేవామూర్తులను సముచితంగా గౌరవించుకోవడం మంచి సంప్రదాయమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధి కారి డా. కె.వి.రమణాచారి అన్నారు. పుత్రోత్సా హం తండ్రికి పుత్రుడు పుట్టినప్పుడు కలుగదు సర్వజనులు పుత్రుడ్ని కనుగొని పొగడగ కలుగున్ అన్నట్లు పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి తల్లిదండ్రులను సంస్మరించునేందుకు వారి పేరుతో సాహితీమూర్తులకు, కళాకారులకు క్రమం తప్ప కుండా పురస్కారాలతో గౌరవించడం హర్షదాయక మన్నారు. శాంతా వసంత ట్రస్టు ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పరిషత్తు అధ్య క్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగిన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి ట్రస్టు ఛైర్మన్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి, డా. జె.చెన్నయ్యలతో కలిసి ప్రముఖ సినీ గేయరచయిత డా. సుద్దాల అశోక్‌తేజకు డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని; మనసు ఫౌండే షన్ వ్యవస్థాపకుడు డా.మన్నం వెంకటరాయుడుకు కోడూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారాన్ని పురస్కారాలతోపాటు లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని ప్రదానంచేసి తెలుగుభాషా సాహిత్య సంస్కృతుల పరిరక్షణ వికా సానికి జరిగే కృషి భావితరాలకు మన వైభవాన్ని పదిలపరిచి అందించడం, అందుకు పాటుపడు తున్న విద్వాంసులను గౌరవించడం మంచి పరిణామని అన్నారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య సభను నిర్వహించగా, ట్రస్టు కార్యదర్శి నవీన్ వందన సమర్పణ చేశారు.

# అనాథలయిపోతున్న తల్లిదండ్రులు...!

*** తల్లిదండ్రుల పోషణే భారం అంటున్న పుత్రరత్నాలు * వృద్ధుల మరణాల కేంద్రంగా 'గాంధీ'**




**హైదరాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త**

అంతరించిపోతున్న మానవత్వానికి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి చిహ్నంగా మారిపోతోంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా పక్క రాష్ట్రాల నుంచీ నిత్యం వందలాది మంది గాంధీ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చి ఆరోగ్యంతో వెళుతుంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని వైద్య పరికరాలను ఏర్పాటు చేయడంతో పాటు కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా వైద్యం అందించే ఏర్పాట్లు చేస్తుండగా వైద్యులూ వచ్చిన ప్రతిరోగికి ఆరోగ్యాన్ని అందించి పంపాలనే లక్ష్యంతో విధులు నిర్వహిస్తుండగా మానవత్వం లేని కొందరు వారి రాక్షసత్వానికి గాంధీ ఆస్పత్రిని వేదికగా మలుచుకుంటున్నారు. అయితే పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించిన తల్లితండ్రులు, తాతలు లాంటి వారిని కళ్లల్లో పెట్టుకొని చూడాల్సిన వారిని ఒక్కపూట కూడా ఇంత ముద్దపెట్టడం ఇష్టంలేక తీసుకువచ్చి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో వదిలి వెళుతున్నారు. మరికొందరు గాంధీ ఆస్పత్రి మెట్రో రైల్వేస్టేషన్ కింద వదిలేసి పోతున్నారు. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో లభించే గుర్తు తెలియని వృద్ధుల మృతదేహాలు ఎక్కువ శాతం అలాంటివే అనడంలో సందేహం లేదు. తనవాళ్లు ఇక్కడ వదిలి ఎక్కడికి వెళ్లారో తెలియన వయసుడిగిన వృద్ధులు ఎక్కడికి వెళ్లాలో తెలియక, తన కొడుకో, మనవడో ఎవరో ఒక్కరు వచ్చి తీసుకువెళతారని ఎదురు చూస్తూ తీవ్ర అనారోగ్యం పాలై చివరికి ప్రాణాలు వదిలేస్తున్నారు. గతంలో మనుషులు తిరగాడే చోట తల్లితండ్రులను విడిచి వెళుతుండగా చుట్టపక్కల వారు ఎందుకు వదిలేసి పోతున్నారని ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయి. వదిలేసి వెళుతున్నవారికి స్థానికులు గట్టిగా బుద్ధిచెప్పిన సంఘటనలు లేకపోలేదు. కాని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో వదిలేసి వెళితే ఎవరూ ప్రశ్నించే పరిస్థితి ఉండదు. సాధారణ రోగుల్లా వచ్చి వృద్ధులను వదిలి ఆస్పత్రిలోకి వెళ్ళి అటునుంచి అటే వెళ్ళిపోతే ప్రశ్నించే దిక్కే ఉండదు.

**ఇప్పటి వరకు రెండు వందలకు పైగా....**

చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఇప్పటి వరకు దాదాపు రెండు వందలకు పైగా గుర్తు తెలియని మృతదేహాలను చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకొని మార్చురికి తరలించి అనంతరం తీసుకోల్సిన చర్యలు తీసుకున్నారు. ఇందులో దాదాపు నాలుగింట మూడు వంతులు కేవలం గుర్తు తెలియని వృద్ధుల మృతదేహాలే. అంతేకాకుండా మతిస్థిమితం తప్పిన వారు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కూడా గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స జరుగుతున్న క్రమంలోనే వదిలేసి వెళ్లి సంఘటనలు ఉన్నాయి. బ్రతకరు అని తెలిసి వారు ప్రాణాలు వదిలితే జరపాల్సిన కార్యక్రమాలను పూర్తి చేయడానికి ఆర్థిక పరిస్థితి లేకపోవడంతో పారిపోయిన సంఘటనలు పోలీసుల దర్యాప్తులో విస్తుగొలిపే అనేక విషయాలు వెలుగు లోకి వచ్చాయి. కొన్ని సంఘటనల్లో చిలకలగూడ పోలీసులే మానవత్వంతో వ్యవహరించి సంఘటనలు ఉన్నాయి. రోగులను వదిలి వెళ్ళిన ఘటనల్లో పోలీసులు దర్యాప్తు జరిపి ఆచూకి తెలుసుకుంటే వారి పరిస్థితి బాధాకరంగా ఉండడంతో పోలీసులు మృతదేహం తరలింపునకు సహకరించడంతో పాటు అంత్యక్రియలు జరపడానికి ఆర్థికంగా సహాయం చేసిన ఘటనలు ఉన్నాయి.

**మతిస్థిమితం కోల్పోయి....**

రోగులు కొందరు మతిస్థిమితం కోల్పయి ఎలాంటి పని చేయకుండా కుటుంబానికి భారంగా మారడంతో బరించలేని కొందరు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణం, గాంధీ ఆస్పత్రి మెట్రో రైల్వేస్టేషన్ వద్ద వదిలేసి వెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా అర్థరాత్రిళ్ల తీసుకువచ్చి వదిలేసి వెళుతున్నట్లు తెలుసుకున్నారు. వదిలేసే సమయంలో ఎవరైనా చూసినా ప్రశ్నించే అవకాశం లేకుండా వచ్చినంత వేగంగా వెళుతుంటారు. చాలా వరకు మానవత్వం నశించి వృద్ధులైన తల్లితండ్రులను, తాతలను, నానమ్మలను, అమ్మమ్మలను వదిలేసిపోతున్నారు. కుటుంబ పరిస్థితులు ఏమైనప్పటికి వృద్ధులను, మతిస్థిమితం లేని వారిని కుటుంబ సభ్యులే కాదనుకుంటే పరాయివారు ఎలా అక్కున చేర్చుకుంటారో ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా విజిటర్స్ ఉండే షెడ్లవద్ద గుర్తు తెలియని వృద్ధులు బెగ్గింగ్ చేస్తూ మృతి చెందుతున్నారు. గాంధీ ఆస్పత్రి వద్ద తరచు అన్నదానం (ప్రధాన గేటు వద్ద) చేస్తుండడం వల్ల కూడా ఎక్కడెక్కడి నుంచో ఇక్కడి వచ్చి రోజులు గడుపుతున్నవారు కూడా మృతి చెందుతున్నారు. తీవ్ర అనారోగ్యంతో స్పృహతప్పి ఉండే వారిని గాంధీ ఆస్పత్రి సిబ్బంది ఆస్పపత్రిలో చేర్చగా నాలుగైదు రోజుల పాటు చికిత్స పొంది మృతి చెందుతున్నారు. ఇలాంటి సంఘటన పట్ల ఆస్పత్రి అధికారులు కూడా బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని రోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**కంటోన్మెంట్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ మెంబర్ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితలు తెలిపారు. 2 నెలల క్రితం ఓ సంఘ విద్రోహశక్తి అమ్మవారిని కూల్చివేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ప్రభుత్వ స్పందించి రూ.30 లక్షల వ్యయంతో వి గ్రహ పునః ప్రతిష్టాపన జరిగింది. ఈ సందర్భంగా అదివారం నిర్వహించిన బోనాల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక నేతృత్వంలో జరిగిన బోనాల వేడుకలకు మాజీఎమ్మెల్సీ రాంచందర్‌రావ్, బిజెపి నాయకులు మేకల సారంగపాని, బానుక మల్లికార్జున్, బి.ఎన్.శ్రీనివాస్, నరి ్సంగ్ రావ్, కొంతం నరేశ్,టోపి శంకర్, చిన్న వీరయ్య, నాగభూషణ్ రెడ్డి, శారధ మల్లేశ్, విజయ లక్ష్మి, సీతాఫల్ మండి కార్పోరేటర్ శా ్యమల హేమ, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నంది కంటి రవి,శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర తదితరులు

**పలహారం బండి ఊరేగింపులో...**

కుమ ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో నిర్వహించిన బోనాలవేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో జోగిని శ్యామల, మోండా కార్పొరేటర్ కొంతం దీపికలతోపాటు కుమ్మరిగూడ బస్తీ్ వాసులు పలహార బండి ఊరేగింపులతో బోనం ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. దీంతో పరిసర ప్రాంతాలన్నీ శోభాయమయంగా మారాయి.

**వేలాది మందికి అన్నదానం...**

కుమ ్మరిగూడ బోనాలవేడుకలను పురస్కరించుకొని ముత్యాలమ్మ దేవాలయం వద్ద మోండా కార్పోరేటర్ కొంతం దీపిక ఆధ్వర్యంలో వేలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పోలీసులపై ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే సహించం

**ఎసిపి విష్ణుమూర్తి**



**హైదరాబాద్, డిసెంబరు 22, ప్రభాతవార్త:** సంధ్య థియోటర్ తొక్కిసలాట వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ వేదికగా సిఎం రేవంత్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. హీరో అల్లుఅర్జున్ సైతం ఆతర్వాత మీడియా సమావేశం నిర్వహించి తనపై వచ్చిన ఆరోపణలు ఖండించారు. తనవ్యక్తిత్వాన్ని హననం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తాజాగా ఈవ్యవహారంపై ఏసీపి విష్ణుమూర్తి తీవ్రంగా స్పందించారు. ఈమేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంధ్య థియేటర్ తొక్కిసలాటల ఘటనలో అల్లు అర్జున్ ఒక రిమాండ్ ఖైదీ అని ..కేసు విచారణ కోర్టులో ఉండగా ముద్దాయి ప్రెస్‌మీట్ పెట్టొచ్చా ? అని ప్రశ్నించారు. సంధ్య థియేటర్ వద్ద పోలీసులు వద్దని చెప్పినా అల్లు అర్జున్ వినలేదని పోలీసులపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. అల్లుఅర్జున్ బాధ్యతగల పౌరుడిగా ప్రవర్తించలేదని..భౌన్సర్ల తోపులాటతోనే మహిళా చనిపోయిందని ఆరోపించారు. పోలీసులు తమ విధులను సరిగానే వ్యవహరించారని..పోలీసులంటే కనీస గౌరవం లేకుండా మాట్లాడుతున్నారని పోలీసులుపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలన్నారు. అధికారులను ఇష్ట వచ్చినట్లు తిడితే రీల్స్ కట్‌చేస్తామంటూ ఘాటుగా స్పందించారు. అల్లు అర్జున్ డబ్బుమదంతో పోలీసులపై అవాకులు చెవాకులు పేలుతున్నారని, విచారణను ప్రభావితం చేసే విధంగా మాట్లాడుతున్నారని విష్ణుమూర్తి ఫైర్ అయ్యారు. అల్లు అర్జున్ ఒళ్ళ దగ్గర పెట్టుకుని మాట్లాడాలని లేదంటూ తోలు తీస్తామన్నారు. అసలు అల్లుఅర్జున్‌కు తెలంగాణలో అధార్ కార్డ్ ఉందా అంటూ ఏసిపి విష్ణుమూర్తి ప్రశ్నించారు.

## ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న కాకా, పి.వి.రావు

**సైఫాబాద్, డిసెంబరు 22 ప్రభాతవార్త:** పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసి, చివరి శ్వాస వరక డా.బి.ఆర్.అంబేద్కర్ అశయాలకు అనుగుణంగా పనిచేసిన కే ంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి (కాక), మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి.రావు అని పలువురు వక్తలు కొనియాడారు. వారి అశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ స్ఫూర్తి భవన్‌లో జరిగిన కాక 10వ వర్ధంతి, పి.వి.రావు 19 వర్ధంతి సభలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య మాట్లాడుతూ బడుగు వర్గాల ప్రజలకు కూడు, గూడు అందించాలని, అనునిత్యం కాక తపించారని, పేద ప్రజల కోసం 70 వేల కుటుంబాలకు గుడిసెలు వేయించి, గుడిసెల వెంకటస్వామిగా పేరు గాంచారని చెప్పారు. కేంద్ర మంత్రిగా కాక పనిచేస్తూ కార్మికుల సంక్షేమం కోసం అనేక చట్టాలను, సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని, ముఖ్యంగా పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చారని, అంబేద్కర్ పేరిట విద్యా సంస్థలను స్థాపించి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని ఆయన వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్నప్పుడు పి.వి.రావు ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించి విజయం సాధించారని, ఎస్సీల ఐక్యత కోసం ఎంతో కృషి చేశారని, అంబేద్కర్ నమ్మిన సిద్ధాంతాల కోసం, తన జాతి బిడ్డల భవితవ్వం కోసం ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ఢిల్లీలో ప్రాణాలను అర్పించారని, ఆయన త్యాగం మరువలేనిదని చెన్నయ్య తెలిపారు. ఈ సభకు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా నాయకులు గోపాజు రమేష్, బైండ్ల శ్రీనివాస్, మధుబాబు, నిమ్మ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## సమాజాభ్యుదయానికి తోడ్పాటునందించాలి

**డిఆర్‌డిఓ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త మాణికవాసగం**

**చిక్కడపల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగరంలో కొన్ని దశాబ్దాల నుంచి వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న తమిళ ప్రజల ఐకమత్యంగా ఉంటూ సమాజాభ్యుదయానికి తోడ్పాటును అందించాలని ప్రముఖ శాస్త్రవేత్త, భారత రక్షణ మంత్రిత్వ శాఖ డిఆర్‌డిఓ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డా.ఎం మాణికవాసగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియో ఇన్ఫోమాటిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐజిఎస్‌టి) అదనపు సర్వేయర్ జనరల్ డాక్టర్ ఎం.కె.స్టాలిన్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జానపద శాస్త్రీయ సంగీతోత్సవాలు సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజశేఖర్, ఉపాధ్యక్షుడు పి.ధర్మసీలన్, కోశాధికారి ఎన్. నెహ్రుశాస్త్రి ఆధ్వర్యంలో జరిగింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ కళలు, సాంస్కృతిక శాఖ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమిళ సంఘం నిర్వహించి తమ పాత్ర పోషించాలన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఎం.కె.బోస్ మాట్లాడుతూ నగరంలోని తమిళ సమాజంల సంబంధించిన ప్రాధాన్యతలను వివరించారు. తమిళ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం భూమి కేటాయించడంతోపాటు నిధులను మంజూరుచేయాలని, స్కూళ్లలో మొదటి భాషగా తమిళాన్ని ప్రవేశపెట్టాలని, ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చైన్నై వరకు వెళ్లే చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌ను కన్నాకుమారి వరకు పొడగించాలని, ఫలితంగా ప్రధాన దేవాలయాలైన చిదంబరం, కుంభకోణం, తంజావూర్, ముధరై ప్రాంతాల దేవాలయాలను సందర్శించే అవకాశం ఉంటుందని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సంయుక్త కార్యదర్శులు టి.కుమారరాజన్, ఇ.జగదీశన్ పాల్గొన్నారు.

## ముదిరాజులను బిసి-ఎలో చేర్చాలి

**-ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లదుర్గం సురేష్**

**చిక్కడపల్లి, డిసెంబరు 22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రిజర్వేషన్ శాతాన్ని పెంచుతూ ముదిరాజులను బీసీ-ఏ లో చేర్చాలని ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అల్లదుర్గం సురేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది చిల్లా రమేష్ మూదిరాజ్, సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారి నర్సింహులు మాట్లాడుతూ అనంతరామన్ కమిటీ తన నివేదికలో ముదిరాజ్ కులం విద్య, ఉద్యోగ, సామాజిక, వృత్తుల పరంగా నిమ్నస్థాయిలో ఉన్నదని భావించినప్పటికీ నాటి పాలకవర్గం ఆంధ్ర, స్థానిక నాయకుల కుటిల బుద్ధితో బీసీలలో ఏబిసిడి వర్గీకరణ చేసి ముదిరాజులకు రిజర్వేషన్లు దక్కకుండా చేసిన విధానాన్ని తప్పు పట్టడం జరిగిందన్నారు. ముదిరాజులు అన్నిరంగాల్లో వెనుకబడడానికి రిజర్వేషన్లే కారణమని తెలిసిన మేధావులు, నాయకులు నోరు మెదపకపోవడం విస్మయానికి గురిచేస్తుందని, 2009లో మాజీముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజులను జీవో 15 ద్వారా బీసీ ఏ లోకి మార్చినప్పటికీ దాన్ని అమలు చేయడంలో నిరక్ష్యం వహించిన రాష్ట్రంలోని అన్ని పార్టీలు, ప్రభుత్వాలు, బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. 12 సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో నానుతూ వస్తున్నా సమస్యను పరిష్కరిస్తామని చెప్పి రాష్ట్ర పరిధిలోకి తీసుకువచ్చి నేటికీ రెండు సంవత్సరాలు దాటిపోయిన ఇప్పటికి బీసీ-ఎ కల గానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు టి. సంజయ్ ముదిరాజ్,నాయకులు బి.నారాయణ ముదిరాజ్, కటికల శ్రీహరి, మురళి మనోహర్, పొన్నాజిపేట రమేష్, సినేటి శ్రీనివాస్, బాబురావు,చొప్పరి రాము రాజేశ్వరి, అనసూయ, విజయలక్ష్మి, మధు, అనిల్ కుమార్, నర్సయ్య, శ్రీను, బోయిని శివ, జాన్, నరేష్, వేణు, శైలేందర్, రాఘవేంద్ర, వెంకటేష్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ముదిరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మూదిరాజ్ సంక్షేమ సమితి నేత

# ధర్మాన్ని రక్షించాలి.. దేశాన్ని ప్రేమించాలి...

**విశ్రాంత మేజర్ జనరల్ మహేంద్ర**

**రవీంద్రభారతి, డిసెంబరు 22 ప్రభాతవార్త :** మనం ధర్మాన్ని రక్షిస్తే అది మనని కాపాడుతుందని, దేశాన్ని ప్రేమిస్తే మనుగడ సాగుతుందని, ప్రతీ ఒక్కరూ సనాతన ధర్మమే మన ధ్యేయం, మార్గంగా పయనించాలని విశ్రాంత మేజర్ జనరల్ వి.ఆర్.మహేంద్ర విద్యార్థులకు ఉద్బోధించారు. న్యూఎరా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్ట్ ప్రజ్ఞా మయూఖ్ పేరిట జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మేజర్ జనరల్ జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ముఖ్యంగా విద్యార్థులు నిత్యనూతన సాంకేతికతను, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ముందుకుసాగితే అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యార్థులలో చదువుతోపాటు జాతీయభావం, దేశాన్ని దేశప్రజల్ని సహృదయంతో ప్రేమించి ఆదరిస్తూ తమకు తోచిన, వీలైనంత సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అలాగే సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదురుకొంటూ సత్‌ప్రవర్తనతో, అకుంఠిత దీక్ష, పట్టుదలతో తమ అమూల్య భవిష్యత్తును అపురూపంగా తీర్చిదిద్దుకోవాలని, దేశప్రగతిలో కీలకపాత్ర పోషించాలని విశదీకరించారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యకంటే ముందు తల్లిదండ్రులను గౌరవించాలని, పిల్లలకు తల్లిదండ్రులు, తల్లి దండ్రులకు పిల్లలే స్థిరాస్తి అన్నది గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులకు నిజమైన హీరోలుగా సైనికులను స్ఫూర్తిగా తీసుకోవాని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమేనైనా అదుపు అవసరమని, విద్యార్థులు తమ ముఖాన్ని ఫేస్‌బుక్ అకౌంట్లలో కాదు పాఠ్య పుస్తకాల్లో వచ్చేవిధంగా అత్యున్నతస్థాయి, కీర్తిని ఆర్జించాలని హితవుపలికారు. తమ కాలేజీ అభ్యున్నతి, కీర్తిప్రతిష్టలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మూలకారణమని స్పష్టం చేశారు. కళాశాలలో విద్యతోపాటు వివిధరంగాల్లో ప్రోత్సాహన్ని అందిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని శ్రావణ్‌కుమార్ తెలిపారు. చివరిగా కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన, చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆనందోత్సాహాలతో అంబరాన్నంటాయి.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల్లో ఒక దృశ్యం